ప్రజాశక్తి
మంగళవారం 18 మార్చి 2025
5
అల్లూరి సీతారామరాజు

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు ఐటిడిఎ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశంతో పాటు 6, 7, 8, 9 తరగతులలో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో 4వ తరగతి, ఆయా తరగతులు పూర్తిచేసిన వారే అర్హులన్నారు. 5వ తరగతి ప్రవేశానికి బాలురకు మారికవలస గురుకుల పాఠశాలలో 80, కొయ్యూరులో 80, పెదబయలులో 80, అప్పర్ సీలేరులో 80, జి.మాడుగులలో 80, తుమ్మలవలసలో 80 సీట్లు ఉన్నాయన్నారు. అలాగే బాలికలకు పాడేరులో 80, అరకువ్యాలీలో 80 సీట్లు కేటాయించారు. గురుకులాల్లో ప్రవేశాలకు విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక సంవత్సర ఆదాయం రూ.లక్షకు మించకుండా ఉండాలని, మరిన్ని వివరాలకు, దరఖాస్తు కొరకు https://twreiscet.apcfss.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

హైడ్రో పవర్ అనుమతులు రద్దు చేయాల్సిందే

- సిపిఎం ఆధ్వర్యాన భగ్గుమన్న గిరిజనులు
- చిట్టంపూడి నుంచి అనంతగిరి వరకు మన్యవాసుల నిరసన ర్యాలీ
- మండల పరిషత్ కార్యాలయ ముట్టడి

ప్రజాశక్తి -అనంతగిరి : పాడేరు ఏజెన్సీలో టోకూరు పంచాయతీలో హైడ్రోపవర్ ప్రాజెక్టుల ఏర్పాటును అదానీ, అంబానీలకు కట్టబెడుతూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం వెంటనే రద్దుచేయాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజాచైతన్యయాత్రలో భాగంగా వారం రోజులుగా పాదయాత్ర నిర్వహించి సమస్యలను సేకరించారు. సోమవారం చిట్టంపాడు గ్రామం నుండి ములియగుడ మెయిన్ రోడ్డు మీదుగా అనంతగిరి మండల కేంద్రం వరకు ఐదు కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించి, మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించారు. నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ 1/70, పీసా, ఇతర అటవీ చట్టాల నిబంధనలను తుంగలో తొక్కి, టోకూరు పంచాయతీ చిట్టంపాడు, గుమ్మకోట పంచాయతీ గుజ్జెలి, పెద్దకోట పంచాయతీ టముటు, రేగులపాలెం, చింతలపాలెం ప్రాంతాలలో హైడ్రోపవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి అటవీ భూములను, సహజ సంపదను కట్టబెట్టేందుకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. దీనిపై 1/70 చట్టసవరణ అవసరమని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయన్న పాత్రుడు వ్యాఖ్యలపై ఆదివాసి గిరిజన ప్రజా, ఉద్యోగ, నిరుద్యోగ, విద్యార్థి సంఘాల 48 రాష్ట్రవ్యాప్తమన్యం బంద్‌తో కూటమి ప్రభుత్వం దిగొచ్చి, 1/70 చట్ట సవరణ ప్రతిపాదన లేదని ప్రకటించి, హైడ్రోపవర్ ప్రాజెక్టులపై వెనక్కు తగ్గడం లేదన్నారు. దీనిపై గిరిజన సలహా మండలిని నియమించి, గిరిజన చట్టాల అమలుపై చర్చించాలన్నారు. సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, హైడ్రో పవర్ ప్రాజెక్టుతో మండలంలో మూడు పంచాయతీలు నాలుగు ప్రాంతాలలో 40 గ్రాములు. 4 వేల ఎకరాల వ్యవసాయ భూమితోపాటు గిరిజనులకు ఫల సాయాన్నిచ్చే చింత, మామిడి, జీడితోటలు, విలువైన వృక్ష సంపద నాశనమౌతోందన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులను తక్షణమే వెనక్కు తీసుకోవాలని కోరుతూ ఎంపిడిఒ ఎవివి.కుమార్, తహశీల్దార్ మాణిక్యంలకు వినతిపత్రాలు అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి కిల్లో.మొస్య, మండల నాయకులు ఎస్. నాగులుకృష్ణ, సింగులు, వి.బుద్రయ్య, ఎస్ కొండలరావు, పెద్దబిడ్డ ఎంపిటిసి జయశ్రీ, వార్డు సభ్యులు ప్రసాద్, పద్మ, .పి లక్ష్మణరావు పీసా కమిటీ సభ్యులు సుబ్బారావు, రవి, చిన్నారావు, మధు, దేముడమ్మ, కాసులమ్మ, జె. ఈశ్వరరావు పాల్గొన్నారు

మండల పరిషత్ ఎదుట సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న గిరిజనులు

ఆందోళనలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజా చైతన్యయాత్రలో సమస్యల వెల్లువ

మండల, సచివాలయ కేంద్రాల్లో సిపిఎం నిరసన : గుర్తించిన సమస్యలపై వినతిపత్రాల అందజేత

అరకులోయ : సిపిఎం ప్రజా చైతన్యయాత్రలో భాగంగా పెదలబుడు, చినలబుడు పంచాయతీల్లో గుర్తించిన సమస్యలపై ఆపార్టీ జిల్లా నాయకులు పొద్దు బాలదేవ్, మండల నాయకులు కిల్లో జగన్నాథ్, కొర్రా మగ్గన్న, కిల్లో ముకుంద్ ఆధ్వరంయలో మండల పరిషత్ గ్రీవెన్స్‌తోపాటు తహశీల్దార్ కార్యాలయం, చినలబుడు సచివాలయంలో వినతిపత్రాలను అందజేశారు. పెదలబుడు, చినలబుడు పంచాయతీలో తాగునీరు, సాగునీటికి చెక్‌డ్యామ్‌లు, అర్హులకు పిఎం జనమన్ ఇళ్లు ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు, కల్వర్టులు, డ్రైనేజీలు, సిసిరోడ్లు వంటి సౌకర్యాలు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. సిపిఎం మండల నాయకులు తాంగుల హరి, కిల్లో.సహదేవ్, ప్రకాష్ శరభగుడ, తాంగులగుడ గ్రామస్తులు కె.కేశవ, కె.చిట్టిబాబు, పి.కళ్యాణ్, బి.దయితరి, బి.ముకుందు, జె.అర్జున్ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: సిపిఎం ప్రజాచైతన్యయాత్రలో మండలంలోని బస్కి పంచాయతీ పరిధిలోని 27 గ్రామాల్లో గుర్తించిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు, మాజీ ఎంపిటిసి బి దశరథ్ సిపిఎం నేతలు సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. పోడుపట్టాలు, సాగు, తాగునీరు, పివిటిజిలకు జన్‌మన్ ఇళ్లు, ఉచిత గ్యాస్ పంపిణీ, సిసిరోడ్లు,డ్రైనేజీ, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాఫీ, మిరియాలు ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కొర్రా సుబ్బారావు, బి.సద్దు, కె ప్రహ్లాద్, కె రాజు, డొంబు, కె దెబో పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: సిపిఎం ప్రజా చైతన్యయాత్రలో వచ్చిన సమస్యలు పరిష్కరించాలని మాదల సచివాలయం అధికారులకు సిపిఎం నేతలు వినతిపత్రం అందజేశారు.మాదల పంచాయతీ మజ్జివలస జంక్షన్ నుండి దాబుగూడ వరకు మధ్యలో నిలిచిపోయిన తారురోడ్డు పనులు పూర్తి చేయాలని,సరుబెడ్డ జంక్షన్ పొట్టంగిపాడు వరకు రోడ్డు నిర్మించాలని, సరుబెడ్డ, దాబుగూడ, పాలమనివలస,చి ట్టంగొంది, మెదరసోల, తుంగడ్డ గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ,తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. సిపిఎం మండల నాయకులు పి రామన్న, కె రమేష్, జి చందు,దాబుగూడ పీసా కమిటీ ఉపాధ్యక్షులు ఎస్ గురు మూర్తి, గ్రామస్తులు జె మదు, కృష్ణ ,కె అప్పన్న, భగత్ రామ్ పాల్గొన్నారు.

పెదబయలులో వినతిపత్రం ఇస్తున్న సన్నిబాబు

జన్‌మన్ ఇళ్లకు రూ.పదిలక్షల సాయం ఇవ్వాలి

పెదబయలు : అర్హులకు పిఎం జన్‌మన్ పథకంలో ఇళ్ల కేటాయింపుతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.పదిలక్షల సాయం ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి బోండా సన్నిబాబు డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ప్రజాయాత్రలో భాగంగా సీతగుంట పంచాయతీ పరిధిలో సేకరించిన సమస్యల పరిష్కారానికి తహశీల్దార్ జి.రంగారావు, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న గృహనిర్మాణసామగ్రి ధరలకు అనుగుణంగా ఇంటినిర్మాణంసాయం పెంపుతోపాటు ఉచితంగా ఇసుక ఇవ్వాలని, ఉపాధి బకాయిలు చెల్లించాలని, గత ప్రభుత్వహయాంలో మంజూరైన జగనన్న ఇంటి స్థలాలను కేటాయించాలని, అర్హులకు పింఛన్లు, వీధిదీపాలు, తాగునీరు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు జె, సునీల్ కుమార్, పి.బుజ్జిబాబు హౌసింగ్ , రెడీయా,సాగర్, కుమారి, దడియా మణి, శాంతి పాల్గొన్నారు

డుంబ్రిగుడ: మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో సిపిఎం ప్రజాచైతన్యయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రైనేజీ, సిసి రోడ్లు నిర్మించాలని ఆందోళన చేపట్టారు. సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు, పార్టీ నాయకులు టి సూర్యనారాయణ, పాల్గొన్నారు.

అరుకులో వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు, గిరిజనులు

డుంబ్రిగుడలో ప్రజా చైతన్యయాత్రలో సిపిఎం నేతలు

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

జిల్లాలో 71 కేంద్రాల్లో 1,377 మంది విద్యార్థుల హాజరు

112మంది రెగ్యులర్, ఐదుగురు ప్రయివేటు విద్యార్థుల గైర్హాజరు

పాడేరులోని కేంద్రంలో పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్న టెన్త్ విద్యార్థులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సామాన్య శాస్త్రం పరీక్షలు మినహా మిగతావి ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్‌టిసి బస్సులో ఉచితంగా ప్రయాణ సదుపాయం కల్పించారు. పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులు, తల్లిదండ్రుల రాకతో సందడి వాతావరణం నెలకొంది. విద్యార్థులు పరీక్షలు రాయడానికి మొత్తం జిల్లాలోని 71 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 11466 మంది విద్యార్థులకు గాను 11354 మంది హాజరుకాగా, 112 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 28 మందికి 23 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. అదేవిధంగా జిల్లా కేంద్రం పాడేరు కుమ్మరిపుట్టులో ఎపిటిడబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికలు), ఎపిటిడబ్ల్యూ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, పాడేరు గవర్నమెంట్ హైస్కూల్, తలారిసింగి జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాల (బాలురు), శ్రీకృష్ణాపురం జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాల (బాలికలు), లోచలిపుట్టు జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాల (బాలురు) కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,002 మందికిగాను 998 మంది హాజరుకాగా నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. విద్యార్థులు ఉదయం 8.15 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోగా, వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత 8.30 గంటలకు పరీక్ష కేంద్రాల లోపలికి అనుమతించారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగాయి. మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదు. పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేశారు. జిరాక్స్ కేంద్రాలను మూసేయించారు.

గ్రామ పంచాయతీ కార్యాలయము - పెదలబుడు

రేఖా నెం.03/2025 **తేదీ.11-03-2025**

బహిరంగ వేలం మరియు టెండరు ప్రకటన

పెదలబుడు గ్రామపంచాయితీకి చెందిన ఈదిగువ వివరించిన 2025-26 సం॥రంనకు బహిరంగవేలం తే: 19-03-2025దీ బుధవారం ఉదయం 11-00 గం॥లకు గ్రామపంచాయితీ కార్యాలయము (అరకువేలి) నందు కార్యనిర్వహణాధికారి (పంచాయితీ కార్యదర్శి) వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని జరుపబడును. మరియు సీల్డు టెండర్లు తే: 19-03-2025దీ బుధవారం ఉదయం 11.00 గం॥ల నుండి ఉదయం 12.00 వరకు గ్రామపంచాయితీ కార్యాలయము అరకువేలి నందు స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు ఉదయం 02-30 ని॥లకు హాజరైన టెండరుదార్లు సమక్షంలో సీలు వేసిన టెండర్లు ఈ కార్యాలయములో తెరువబడును.

షెడ్యూల్-1

వ. నెం	వేలం మరియు టెండరు ప్రకటన	సర్కారి వారి పాట	సాల్వెన్సీ	ధరావత్తు పైకము
1.	పెదలబుడు గ్రామపంచాయితీ పరిధిలో గల అరుకువేలి గ్రామములో నిర్మించిన సులబ్ కాంప్లెక్స్ నిర్వహణ 2025-26 సం॥రంనకు		50,000/-	10,000/-
2.	గ్రామపంచాయితీకి చెందిన పాత సామాగ్రి వేలం వేయుట గూర్చి		30,000/-	5000/-
3.	పెదలబుడు గ్రామపంచాయితీకి పారిశుధ్య నిర్వహణ పి.హెచ్. మెటీరియల్ మరియు వీధిలైట్లు నిర్వహణ నిమిత్తం విద్యుత్ విడి పరికరాలు, మంచినీటి పథకాల నిర్వహణ నిమిత్తం విడి పరికరాలు సరఫరా నిమిత్తం సరఫరాదారులను టెండర్ పిలుచుట గూర్చి		50,000/-	5000/-
4.	పెదలబుడు గ్రామపంచాయితీ రోజువారీ మార్కెట్ నందు ఆశీలు వసూలు చేసుకొనే హక్కు నిమిత్తము	70,000/-	30,000/-	5000/-
5.	కబేలా వేలం నిమిత్తము	30,000/-	50,000/-	5000/-
6.	గ్రామపంచాయితీ ఆధీనంలోని రెండుషాపుల అద్దెకిచ్చుటకు వేలం నిమిత్తము (నెల ఒక్కింటికి 1వ షాపు 6000/- 2వ షాపు 4000/-	1వ షాపు 6000/- 2వ షాపు 4000/- నెల ఒక్కింటికి	30,000/-	5000/-
7.	ఐటిడిఎ షాపింగ్ కాంప్లెక్స్ 1,2లలో పార్కింగ్ ఫీజు వసూలు చేసుకొనే గుత్త హక్కులు బహిరంగ వేలం వేయుట గూర్చి	1,80,000/-	30,000/-	5000/-

షెడ్యూల్ - 2

వ.నె.	టెండరు వివరములు	ధరావత్తు పైకం
1.	గ్రామపంచాయితీ పారిశుధ్యం పనివార్లును 15 మంది సప్లయి చేయుటకు ప్రభుత్వ నియమనిబంధనలు, ఉత్తర్వులకు లోబడి 2025-26 సం॥రంనకు	రూ.3,000/-
2.	గ్రామపంచాయితీకి చెందిన 3 పారిశుధ్య ట్రాక్టరు నడుపుటకు డ్రైవరు పనులు 2025-26 సం॥నకు గ్రాను ఇద్దరు డ్రైవర్లు మంజూరు కొరకు	రూ.500/- (ఒక్కొకరి)
3.	గ్రామపంచాయితీకి చెందిన పారిశుధ్య మినీ ఆటోడ్రైవర్ పనులు 2025-26 సం॥రంనకు	రూ.500/-
4.	గ్రామపంచాయితీ వీధి కొళాయి రిపేర్లు, పైపులైన్లు రిపేర్లు, నిర్వాహణ కొళాయి రెండు పూటల విడిచి పెట్టుటకు ఐదగురు వ్యక్తులు (5) పనులు 2025-26సం॥రంనకు	రూ.500/- (ఒక్కొకరి)
5.	గ్రామపంచాయితీ శానిటరీ పనులు పర్యవేక్షణ నిర్వాహణ పనులు 2025-26 సం॥నకు	రూ.500/-
6.	గ్రామ పంచాయితీ పరిధిలో గల గ్రామములలో నూతనముగా నిర్మించిన వాటర్ ట్యాంకులు మోటార్లుకు మెంటినేన్స్ నిమిత్తము మరియు వీధిలైట్లు నిర్వహణ ఎలక్ట్రిషియన్ (1) మరియు హెల్పర్ (1) పనులు 2025-26 సం॥రంనకు	రూ.500/- (ఒక్కొకరి)
7.	గ్రామపంచాయితీకి అవసరమగు పి.హెచ్. పనిముట్లు బ్లీచింగ్, సున్నం, ఫినాయిల్, కొబ్బరి పుల్లలు చీపుర్లు 2025-26 సం॥రంనకు ప్రభుత్వం వారు సిఫార్సు చేసిన రెట్లుకు లోబడి సరఫరా చేయుటకు	రూ. 500/-

టెండరు/వేలం షరతులు : (1). 2025-26 సం॥రం టెండర్లులో పాల్గోనదలచిన వారు షెడ్యూలలో చూపబడిన వాటికి ఎదురుగా ధరావత్తు పైకము చెల్లించి, సంబందిత అధికారుల నుండి రశీదు పొంది టెండర్లు దాఖలు చేయవలెను. (2). ఈ గ్రామ పంచాయితీకి ఏ విధమైన బకాయిదారులుగాని, ఇంటిపన్ను చెల్లించనివారు టెండర్లులో పాల్గోనరాదు. (3). ఈ గ్రామపంచాయితీకి సివిల్/క్రిమినల్/ఇ.డి.కేసులు వేయబడిన వారుగాని, యీ గ్రామపంచాయితీపై కేసులు దాఖలు చేసిన వారు గాని టెండర్లులో పాల్గొనుటకు అనర్హులు (4). స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధులు (ఎం.పి.టి.సి.లు జెడ్.పి.టి.సి.లు గ్రామపంచాయితీ వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, ఎం.పి.పి. మొదలగువారు) గాని, వారు కుటుంబసభ్యులు గాని టెండర్లులో పాల్గొనరాదు. (5) టెండర్లు ఎట్టి కారణము చూపిగాని, చూపకగాని, వాయిదా వేయుటకు, తిరస్కరించుటకు ఆమోదించుటకు గ్రామపంచాయితీకి సంబంధిత అధికారులకు పూర్తి అధికారము కలదు. (6). గ్రామపంచాయితీ నోటిఫికేషన్ నందలి షరతులను టెండరుదార్లు విడిగా పాటించవలెను. టెండరు/వేలం ఖాయపడినవారు గ్రామపంచాయితీ ఆమోదము తదుపరి నాన్ జుడిషియల్ స్టాంపులపై అగ్రిమెంట్ వ్రాసి దాఖలు చేయవలెను. భవిష్యత్‌లో జరుగు ఎటువంటి పరిణామాలకు గ్రామపంచాయితీకి గాని సంబందిత అధికారులకు గాని ఎటువంటి సంబంధం లేదు. (7) గ్రామపంచాయితీలో ఇది వరకు పని చేసిన అనుభవమువున్న వ్యక్తులు అయివుండవలెను. (8) 2025-26 సం॥రం వేలం పాటలో పాల్గొనదలచిన వారు షెడ్యూలులో చూపబడిన వాటికి ఎదురుగా ధరావత్తు పైకము చెల్లించి సంబంధిత అధికారుల నుండి తే: 01-03-2025దీ తరువాత జారీకాబడిన మోతుబరి ధృవపత్రం దాఖలు చేసి పాటలో పాల్గొనవలెను. (9) బహిరంగ వేలం పాటలో హెచ్చు పాటదారు పాట ముగిసిన పిమ్మట సదరు ఐటంనకు దాఖలు కాబడిన హెచ్చు పాట మొత్తం ఖారారు చేయబడును. (10) వ.నెం.1 సంబంధించిన వేలం పాటలకు రూ. 50,000/-లు విలువ గల సాల్వేన్సి ధృవపత్రములు సంబంధిత శ్రీ డివిజనల్ పంచాయితీ అధికారి, పాడేరు వారినుండి సాల్వేన్సి ధృవపత్రము పొంది జతపరచవలెను. మిగిలిన 2,3వ వ.నెం. దానికి రూ.30,000/-లు విలువ గల సాల్వేన్సీ ధృవపత్రం సంబంధిత శ్రీ విస్తరణాధికారి (పం.రా॥ & ఆర్.డి.) మండల పరిషత్ అరకువేలి వారి నుండి పొందవలెను. (11). టెండరుదారులు టెండరు ఖాయపర్చిన తదుపరి నాన్ జుడిషియల్ స్టాంపులపై అగ్రిమెంట్ ఈ దిగువ సంతకం దారునకు దాఖలు చేయవలెను. స్టాంపులు దాఖలు చుసిన తదుపరి మీ యొక్క పనులు ప్రారంభించవలెను. పై షరతులుకు అంగీకరిస్తూ వేలం మరియు టెండర్లులో పాల్గోనవలెను. యితరు షరతులు, వివరములు కార్యాలయము పనిచేయవేలలందు అడిగి తెలుసుకొనవలెను. (12) ఈ దాఖలైన టెండర్లను సుమారుగా రెండు సం॥ లేక మూడు సం"ములు అనుభవం పొంది ఉండవలెను. లేనిచో వారు అనర్హులుగా గుర్తించబడును. **సం/-పాలక రాజ్‌కుమార్** పంచాయితీ కార్యదర్శి గ్రామపంచాయితీ - పెదలబుడు

పాఠశాల శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల వద్ద ధర్నాలు

- వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్

రంపచోడవరం ఐటిడిఎ ఎదుట ధర్నా చేస్తున్న స్కూల్ శానిటేషన్ వర్కర్లు

ప్రజాశక్తి-రంపచోడవరం

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పాఠశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. దీనికి ముందు సిఐటియు జిల్లా కార్యాలయం నుండి ఐటిడిఎ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.శాంతిరాజు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు పేద వర్గానికి చెందినవారు శానిటేషన్ కార్మికులుగా పనిచేస్తూ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుతున్నారని తెలిపారు. వారు చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని, ఇచ్చే అతితక్కువ వేతనాలు కూడా నెలల తరబడి వేతనాలు పెండింగ్లో ఉండటం వలన కుటుంబాలను పోషించలేక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శానిటేషన్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎన్నో పలుమార్లు ఎన్ని వినతి పత్రాలు ఇచ్చినా సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోయారు. ఇప్పటికైనా బకాయి పడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలని, ప్రతినెల 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలని, ప్రమాద బీమా కల్పించాలని, సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సబ్ కలెక్టర్ కల్పశ్రీకి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ కార్మికులు కోసు విజయ కుమారి, చోడి లక్ష్మీ ప్రసన్న, టి.రాజమణి, పి.భారతి, వరద లక్ష్మి కుమారి, బి.రత్నకుమారి, పి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : ఆశ్రమ పాఠశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన చింతూరు ఐటీడీఏ ముందు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పోడియం లక్ష్మణ్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల/కళాశాలల్లో పనిచేస్తున్న శానిటైజర్ వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, ప్రమాద బీమా కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగాలుగా గుర్తించాలని, మూడు నెలలు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, పని భారాన్ని తగ్గించాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా శానిటేషన్ వర్కర్ల మహా ధర్నా చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఏవోకి అందజేశారు. కార్యక్రమంలో శానిటైజర్ వర్కర్లు సుజాత, విజయ, సురేఖ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చింతూరు ఐటిడిఎ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పీసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఏజెన్సీలో పీసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని మండల పీసా సంఘం మండల అధ్యక్షులు తాము సూరిబాబు, ఆదివాసీ నాయకులు సోమవారం రాజవొమ్మంగి తహశీల్దార్ అల్లు సత్యనారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సూరిబాబు తదితరులు మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాలలో గిరిజన నేతరులు గిరిజన చట్టాలకు విరుద్ధంగా భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని తెలిపారు. అటువంటి వారిపై రెవెన్యూ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏజెన్సీలో 1/70 చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వ అధికారులు విఫలమవుతున్నారని, ఇప్పుడైనా గిరిజన చట్టాలకు అనుగుణంగా అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరించాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నేతలు లోత రాజబాబు, తెడ్ల రాంబాబు, భీమరాజు, నాని, లక్ష్మణ్ రెడ్డి, వెంకటరావు, వీరబాబు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

జి.మాడుగులలో పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషేక్ గౌడ్

ముంచింగిపుట్టు: మండల పరిధిలోని బంగారుమెట్ట బాలికలు, కిలగడ కేజీబీవీ బాలికలు, బాలురు, పెద్దగూడ బాలురు, ముంచింగిపుట్టు బాలురు 1,2, బాలికలు 1,2 పనసపుట్టు బాలికలు, లబ్బూరు బాలురు, లక్ష్మీపురం బాలురు, జోలా పుట్టు బాలికలు, జడ్పీ హైస్కూల్ బాలురు కేంద్రాల్లో పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలం కేంద్రంలోని బాలికలు 1 పరీక్ష కేంద్రంలో ముగ్గురు విద్యార్థులు, జోలాపుట్టు జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో ఇద్దరు గైర్హాజరైనట్లు ఎంఇఒ కృష్ణమూర్తి తెలిపారు.ముంచంగిపుట్ట బాలికల 1 పరీక్షా కేంద్రంలో160 మంది విద్యార్థులకు 157 మంది, బాలురు 1 పరీక్ష కేంద్రంలో170మంది విద్యార్థులంతా పరీక్షకు హాజరయ్యారు. జోలాపుట్టు జడ్‌పి హైస్కూల్ పరీక్ష కేంద్రంలో160 మందికిగాను ఇద్దరు పరీక్షకు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో స్పెషల్ స్క్వాడ్ హుకుంపేట ఎంఇఒ సిహెచ్ చెల్లయ్య మూడుపరీక్ష కేంద్రాలకు తనిఖీ చేశారు.

జి.మాడుగుల : మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలను, గాంధీనగరం గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలల్లో టెన్త్ పరీక్ష కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల ఫరిధిలో అమలు జరుగుతున్న 144 సెక్షన్, జిరాక్స్ షాపులు మూసివేత పరిశీలించారు.మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

రంపచోడవరం : ఏజెన్సీలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతమైన వాతావరణంలో ప్రారంభమయ్యాయి. రంపచోడవరం ప్రభుత్వ హైస్కూల్లో పరీక్షా కేంద్రాన్ని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో అన్ని పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ప్రశాంత వాతావరణం కల్పించాలని, వెలుతురు, ఫ్యాన్లు, తాగునీరు వంటి మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రామ తులసి ఉన్నారు.

అడ్డతీగల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో పదో తరగతి పరీక్షలకు 177 మందికి 177 వంద శాతం విద్యార్థులు హాజరయ్యారు. ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో 187 మందికి 186 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. స్థానిక తహశీల్దారు సూర్యారావు, ఎస్సై వినోద్, ఎంఇఒ పి.శ్రీనివాస్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షల సిఎస్ గోపాలకృష్ణ, ఎం రామారావు ఆధ్వర్యాన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో పరీక్షా కేంద్రంలో మొదటిరోజు తెలుగు పరీక్షకు 153 మందికి 151 మంది విద్యార్థులు హాజరయ్యారు. డిపార్ట్మెంటల్ అధికారిగా పి.సోమరాజు, స్పెషల్ ఆఫీసర్లుగా జీకే వీధి మండల ఇఓపిఆర్డి పాపారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మధుసూదన వ్యవహరించారు. సీలేరు పరీక్షా కేంద్రంలో సీలేరు జెడ్‌పి హైస్కూల్ నుండి 33 మంది, ఏపీ గురుకుల పాఠశాల నుండి 64, బాలికల ఆశ్రమ పాఠశాల నుండి 37, డిఎవి పాఠశాల నుండి 19 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ పి.నాగేశ్వరరావు తెలిపారు. సీలేరు ఎస్సై రవీంద్ర పర్యవేక్షణలో పరీక్ష కేంద్రం చుట్టుపక్కల సిఆర్‌పిఎఫ్, సివిల్ పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొయ్యూరు : కొయ్యూరు పరీక్షా కేంద్రంలో పదో పరీక్షలకు 672 మందికి 669 మంది హాజరయ్యారు. ఎపి గురుకుల పాఠశాలల నుండి ఇద్దరు, ప్రభుత్వ పాఠశాలకి చెందిన ఒకరు గైర్హాజరయ్యారు. తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఎంఇఒ ఎల్.రాంబాబు, ఎంపిడిఒ ప్రసాద్, సిఐ వెంకటరమణ, ఎస్ఐ కిశోర్ వర్మ, మంప ఎస్ఐ శంకర్‌రావు పర్యవేక్షించారు.

రాజవొమ్మంగి : మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో తొలి రోజు పదో తరగతి పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైరాజరైనట్లు ఎంఈఓ 2 సూరారెడ్డి తెలిపారు. జడ్డంగి జెడ్పి హైస్కూల్ కేంద్రంలో 95 మందికి 93 మంది, రాజవొమ్మంగి జెడ్పి హైస్కూల్లో 156 మందికి 155 మంది, రాజవొమ్మంగి ఆశ్రమ పాఠశాలలో 138 మందికి 138 మంది విద్యార్థులు పరీక్ష రాశారని తెలిపారు.

దృఢ సంకల్పంతో పరీక్షకు హాజరైన మానసిక వికలాంగురాలు

రాజవొమ్మంగి : తాను నిస్సహాయ స్థితిలో ఉన్నానని తెలిసి కూడా ఓ మానసిక వికలాంగురాలు దృఢ సంకల్పంతో రాజవొమ్మంగి అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి పదో తరగతి పరీక్షలకు హాజరైంది. రాజవొమ్మంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గెమ్మెల దేవి మానసిక వికలాంగురాలు. తాను నేరుగా పరీక్ష రాయలేనని తెలిసినా పట్టుదలతో పరీక్ష రాస్తానని చెప్పడంతో తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగ సుశీల సహాయంతో రాజవొమ్మంగి పరీక్ష కేంద్రానికి దేవి పరీక్షకు హాజరైంది. పరీక్ష రాసేందుకు అంగవైకల్యం అడ్డు కావడంతో దేవి ప్రశ్నలకు జవాబులు తెలియజేస్తే అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎన్.కుసుమ అనే విద్యార్థిని పరీక్ష రాసినట్లు పాఠశాల హెచ్‌ఎం నాగ సుశీల తెలిపారు. మానసిక అంగవైకల్యం ఉన్నప్పటికీ తన సంకల్పానికి ఏది అడ్డు రాదంటూ విద్యార్థిని దేవి నిరూపించింది. ఈ సందర్భంగా విద్యార్థిని పలు అభినందించారు.

పరీక్షా కేంద్రానికి వచ్చిన వికలాంగురాలు

సమావేశమైన మోదకొండమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు

మోదకొండమ్మ ఉత్సవ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి- హుకుంపేట: మన్య ప్రజల ఆరాధ్యదైవమైన మోదకొండమ్మ జాతర నిర్వహణకు ఉత్సవ కమిటీని నియమించినట్లు స్థానిక సర్పంచ్ సర్పంచ్ వెంకట పూర్ణిమ తెలిపారు. సోమవారం మోదకొండమ్మ ఆలయం వద్ద గ్రామ పెద్దలు, నాయకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువకులుతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మేనెల 4,5,6 తేదీలలో మోదకొండమ్మ జాతర నిర్వహించాలని నిర్ణయించారు. జాతర నిర్వహణకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా పాంగి బొంజుబాబు (అనిల్), ఉపాధ్యక్షులుగా శోభ సాయిరాం, ప్రధానకార్యదర్శిగా సంపంగి శేఖర్, కార్యదర్శిగా వండాలి విశ్వనాథం, ట్రెజరర్‌గా బొడ్డేటి శివ, గౌరవ అధ్యక్షులుగా అరకు ఎమ్మెల్యే రేగం మత్సలింగం, సర్పంచ్ వెంకటపూర్ణిమ, ఎంపీటీసీ కొమ్మ రమ, మాజి జెడ్పిటిసి కొర్ర కాసులమ్మ, సాగరి రాజారావు మాస్టర్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యుల, గ్రామస్తులు, వర్తక సంఘం నాయకులు, ఉద్యోగస్తులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి

సమస్యలపై జెడ్‌పి ఛైర్‌పర్సన్‌కు వినతి

ప్రజాశక్తి -జి మాడుగుల : ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రను విశాఖపట్నంలోని స్వగృహంలో జి.మాడుగుల మండల సర్పంచులు, ఎంపిటిసిలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని 17 పంచాయతీలలో ఉన్న సమస్యలను విన్నవించారు. జి.మాడుగుల మండలంలో మౌలిక సౌకర్యాల కల్పనకు, అభివృద్ధి పనులకు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర స్పందిస్తూ, తగు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు సురభంగి రామకృష్ణ జి.మాడుగుల సర్పంచ్ కిముడు రాంబాబు, లువ్వాసింగి ఎంపిటిసి గబ్బాడి సన్యాసి దొర, సొలభం ఎంపిటిసి కూడా చిన్నారావు. వి.మాడుగుల జెడ్‌పిటిసి రాంబాబు ఉన్నారు.

సమస్యలపై వినతులు స్వీకరిస్తున్న అధికారులు

పిజిఆర్ఎస్‌లో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి -జి.మాడుగుల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లోఏడు అర్జీలు వచ్చాయి. ఎంపిడిఒ డేవిడ్‌రాజ్, తహశీల్దార్ గిడ్డి రాజ్‌కుమార్ పాల్గొని వినతులు స్వీకరించారు

అనంతగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో మూడు వినతులు వచ్చాయని ఎంపిడిఒ ఎవివి.కుమార్ తెలిపారు. టోకూరు పంచాయతీ నుంచి రెవెన్యూవిభాగానికి సంబంధించి రెండు, విద్యుత్ సమస్యకు సంబంధించి ఒక వినతి వచ్చింది. ప్రతిసోమవారం మండల కేంద్రంలో నిర్వహించే పిజిఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కోరారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ మాణిక్యం, వివిధ మండల శాఖల అధికారులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలు పరిష్కరించాలని ఎంపిడిఒ లవరాజు ,సంబంధిత అధికారులను సూచించారు. సోమవారం అరకులోయ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో 15 అర్జీలు వచ్చాయి. రెవిన్యూ, తాగునీరు, రోడ్లు, విద్యుత్తు, హౌసింగ్ సంబంధిత అర్జీలను తగు పరిష్కార చర్యలకు సంబంధిత అధికారులకు రిఫర్ చేశారు.

వాహన పత్రాలు విధిగా ఉండాలి

ప్రజాశక్తి- చింతపల్లి : వాహనదారులు బయట ప్రాంతాలకు వెళ్లేటప్పుడు వాహన పత్రాలు వెంటనే తీసుకు వెళ్ళవలసిన అవసరం ఎంతైనా ఉందని చింతపల్లి ఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా ఎస్‌పి అమిత్ బర్దర్ ఆదేశాలతో ముమ్మర వాహనతనిఖీలు చేపట్టారు. వాహనదారుల బయోమెట్రిక్ ఆధారంగా పాతకేసులు ఉన్నాయో లేదో పరిశీలించారు. బైకిస్టలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలకు ఆస్కారం లేకుండా గమ్యస్థానాలను సురక్షితంగా చేరుకోవాలని సూచించారు.కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ ధనంజయ్, కానిస్టేబుల్ కేశవరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

కొత్తవీధికి సిమెంటు రోడ్డు నిర్మించరూ!

కొత్తవీధిలోని మట్టిరోడ్డు

ప్రజాశక్తి- చింతపల్లి: : కొత్తవీధి గ్రామానికి సిమెంటు రోడ్లు నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు అధికారులు చొరవ చూపాలని కొత్తవీధి గ్రామస్తులు మజ్జి రాంబాబు, లకే చైతన్య, వంతల నాగేశ్వరరావు, లకే మోహనరావు, లకే మూర్తి కోరారు. మేజర్ పంచాయతీ పరిధిలోని కొత్త వీధి గ్రామంలో 40 కుటుంబాలు38 ఏళ్లుగా నివాసం ఉంటున్నామని, అయితే తమ గ్రామానికి సిమెంట్ రోడ్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు మారుతున్నా, వారికి పదేపదే మొరపెట్టుకుంటున్నా తమ సమస్యలను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్లు అగడానికి తప్ప, ఇతర సందర్భాల్లో తమను పట్టించుకునే దిక్కే లేదన్నారుతమ గ్రామానికి త్రాగునీటి సౌకర్యం, సిమెంట్ రోడ్లు, పాఠశాలలు నిర్మాణానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

చూడముచ్చటగా ఉన్న ఘాట్ రోడ్డు

కనువిందుగా చింతాలమ్మ ఘాట్ రోడ్డు

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలంలోని చింతలమ్మ ఘాట్‌లో జాతీయ రహదారి-516 పనులు పూర్తి కావడంతో ఈ మార్గం ఎంతో సుందరంగా చూపరులకు కనువిందు చేస్తోంది. ప్రకృతి రమణీయ కొండలు, చల్లని ఆహ్లాదమైన వాతావరణం నడుమ, ఒంపు సొంపుల వయ్యారమైన మలుపులతో ఈ ఘాట్ రోడ్డు ప్రయాణికుల మదిని దోచేస్తుంది. వాహన చోదకులు వ్యూ పాయింట్ల దగ్గర కెమెరా, సెల్ ఫోన్లో ఈ రహదారి అందాలను బంధిస్తూ ఆహ్లాదకర వాతావరణాన్ని ఎంజాయ్ చేస్తున్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్ అర్జీలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్)కు వచ్చే వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి దరఖాస్తుదారుల అర్హతలను బట్టి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు. స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఐటిడిఎ పిఒతో పాటు సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ, ఐటీడీఏ ఏపీవో జనరల్ డిఎన్వి రమణ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు 82 దరఖాస్తులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యం.రుక్మాండయ్య, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఎడియంహెచ్ఓ జి.శిరీష, డిఎల్డిఓ కె.కోటేశ్వరరావు ఏరియా ఆసుపత్రి ఆర్ఎం డాక్టర్ వెంకట ఇందిర, డిఎల్‌పిఓ నరసింహారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, తహశీల్దారు పి.రామకృష్ణ, ఎంపీడీవో యస్.శ్రీనివాసరావు దొర, పిహెచ్ఓ కె.చిట్టిబాబు, పిఏఓ ఎల్.రాంబాబు, ఏడిఏ సిహెచ్‌కెవి.చౌదరి, వెలుగు డిపిఎం అపర్ణ, ఏయంఓ విజయభాస్కర్, జిసిసి డిఎం జి.పార్వతీశ్వరరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.వెంకటరమణ, సుబ్బారావు, శ్రీనివాసరావు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, డిడి ఆఫీస్ సూపరింటెండెంట్ బి.కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

సిఐఎస్‌ఎఫ్ సైక్లోథాన్‌కు ఘనస్వాగతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారత తూర్పు, పడమటి తీర ప్రాంతాల గుండా 6553 కిలోమీటర్ల తీర రేఖలో సాగుతున్న సిఐఎస్‌ఎఫ్ కోస్టల్ సైక్లోథాన్-2025కు విశాఖలో సోమవారం ఘన స్వాగతం లభించింది. సైక్లోథాన్ బృందంలోని 50 మంది సభ్యులకు ఆర్‌కె.బీచ్ వద్ద విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు సాదర స్వాగతం పలికారు. ఈ సైక్లోథాన్ తీర ప్రాంత ప్రజలకు జాతీయ భద్రతపై అవగాహన కల్పించేందుకు సాగుతున్న విషయం తెలిసిందే.

విశాఖలో ట్రైనీ ఐఎఎస్‌ల బృందం పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 126వ రౌండ్ ఇన్‌డక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రాల పౌర సేవల నుంచి ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఎఎస్)కు ఉద్యోగోన్నతి పొందిన వివిధ రాష్ట్రాలకు చెందిన అధికారుల బృందం సోమవారం విశాఖపట్నం పోర్ట్ అథారిటీని సందర్శించింది. అక్కడి పరిస్థితులను తెలుసుకుంది. అనంతరం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోనూ ఈ బృందం పర్యటించింది. జివిఎంసి పరిపాలన విధానం, ప్రాజెక్టులు చాలా అద్భుతంగా ఉన్నాయని ట్రైనీ ఐఎఎస్‌ల గ్రూప్ లీడర్ రక్షన్ పాంట్ మారక్ పేర్కొన్నారు.

నగర పాలక సంస్థలో..

అవిశ్వాస వ్యూహాలు

మేయర్ పీఠాన్ని కదిలించే దిశగా టిడిపి పావులు
బలాన్ని కోల్పోయి ఆశలు వదులుకున్న వైసిపి
ఒకటి, రెండు రోజుల్లో మారనున్న రాజకీయ పరిణామాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) మేయర్ పీఠం ఏ క్షణాన్నైనా కదలనుంది. ప్రస్తుతం ఆ పీఠం పైనున్న గొలగాని హరివెంకటకుమారి ఈ నెల 18 తరువాత దిగిపోక తప్పదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మేయర్ పదవి కోసం 'కూటమి' పార్టీల విశాఖ నేతలు పలువురు కళ్లు కాయలు కాసేలాగ ఎదురుచూస్తున్నారు. విశాఖ జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్, ఎంఎల్‌సిలు.. ఇలా అన్నీ గెలుచుకున్న వీరు ఒక్క జివిఎంసి మాత్రమే ఇప్పటివరకూ తమ గుప్పెట లేదని తెగ బాధపడిపోతున్నారు. దీన్ని కూడా తమ ఖాతాలో వేసుకుని నగర పాలక సంస్థలో తమ సత్తా చాటేందుకు పావులు కదుపుతున్నారు.

రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారం చేపట్టిన తర్వాత మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లను తమ గుప్పెట్లో పెట్టుకుంటున్న సంగతి తెలిసిందే. నాలుగేళ్లలోపు అవిశ్వాసం పెట్టకూడదన్న నిబంధనతో విశాఖ నగర పాలక సంస్థ జోలికి ఇంతవరకూ అధికార పార్టీ రాలేదన్నది తెలిసిందే. ఒక పార్టీ తరపున నగర పాలక సంస్థలో పోటీకి దిగి గెలుపొందిన వారు మరో పార్టీలోకి ఫిరాయింపులు జరిపిన తర్వాత విశాఖలో టిడిపి బలం 60కి పైగా పాకింది. జివిఎంసి ఎన్నికలు జరిగిన సమయంలో వైసిపికి 65 మంది కార్పొరేటర్లు ఉండేవారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత రాజకీయ సీను మారడంతో టిడిపికి సంఖ్యా బలం గణనీయంగా పెరిగింది. అధికార పార్టీ నుంచి పలువురు కార్పొరేటర్లు టిడిపి, జనసేనల్లో చేరారు. ప్రస్తుతం జివిఎంసి పాలకవర్గంలో 98 మంది కార్పొరేటర్లు, ఇద్దరు ఎంపీలు, ఒక రాజ్యసభ సభ్యుడు, ముగ్గురు ఎంఎల్‌సిలు, 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే 50 శాతం అంటే 56 మంది నోటీసుపై సంతకాలు పెట్టి జిల్లా కలెక్టర్‌కు అందజేయాల్సి ఉంటుంది. ఈ నెల 18 తర్వాత ఈ పని చేసేందుకు కూటమి పార్టీలు సన్నాహాలు చేస్తున్నాయి. ఇప్పటికే సంతకాల సేకరణ కూడా పూర్తిచేసినట్లు తెలుస్తోంది. జిల్లా కలెక్టర్ ఈ కాన్ఫిడెన్స్ మోషన్ (అవిశ్వాస తీర్మానం) కాపీలను పరిశీలించి జివిఎంసి కమిషనర్‌కు సంతకాల వెరిఫికేషన్ కోసం పంపాల్సి ఉంటుంది. అయితే ఇంతవరకూ కూటమి పాలనలో జివిఎంసి కమిషనర్‌ను నియమించలేదు. కలెక్టరే ఇన్‌ఛార్జి బాధ్యతలు చూస్తున్నారు. ఈ రెండు రోజుల్లో ఏం జరుగుతుందో చూడాలి.

డిప్యూటీల కోసం కూటమి పార్టీల మధ్య సిగపట్లు

జివిఎంసి మేయర్ పదవి కోసం ఒకే ఒక్క పేరు టిడిపికి చెందిన 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు విషయంలో ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలుస్తోంది. డిప్యూటీ మేయర్ పదవులను ప్రస్తుతం వైసిపిలో ఉన్న జియ్యాని శ్రీధర్, కట్టమూరి శ్రీధర్ అనుభవిస్తున్నారు. అవిశ్వాస తీర్మానం అయ్యాక కౌన్సిల్‌ను సమావేశ పరిచి చేతులెత్తడం ద్వారా మేయర్, డిప్యూటీ మేయర్‌లను మెజారిటీ సభ్యులు ఎన్నుకోనున్నారు. డిప్యూటీ మేయర్ పదవుల కోసం జనసేన, బిజెపి గట్టిగానే సిగపట్లు పడుతున్నట్లు తెలుస్తోంది. మేయర్ పదవి టిడిపికి ఇచ్చేశాక డిప్యూటీలు రెండూ తమకు కావాలని పట్టుపట్టడంతో పంచాయతీ ఆయా పార్టీల అధిష్టానం వద్దకు వెళ్లింది. ఏదేమైనా మంగళవారం నుంచి జివిఎంసిలో సీను మారనున్నట్టు తెలుస్తోంది.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ అన్నారు. సోమవారం ఉదయం సిరిపురంలోని విఎంఆర్‌డిఎ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఎంఆర్‌డిఎ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మొదటిసారిగా ప్రజాదర్బార్‌ని ప్రారంభించి సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటి వరకు 122 వినతులురాగా వాటిలో 59ను పూర్తిస్థాయిలో పరిష్కరించామని తెలిపారు. ప్రతి 15 రోజులకూ ఒకసారి ప్రజాదర్బారుకి వచ్చిన వినతులపై సమీక్షిస్తున్నట్టు తెలిపారు. 'ది డెక్' పేరిట మల్టీ లెవల్ కార్ పార్కింగ్ భవన నిర్మాణాన్ని వేగవంతం చేశామని పేర్కొన్నారు.

రూ.80 కోట్ల వ్యయంతో నౌక నమూనాలో నిర్మించామని, ఇందులో 1.90 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయం, సుమారు 1.60 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కమర్షియల్ స్థల సదుపాయం ఉందని అన్నారు. తీర ప్రాంత కోతను నియంత్రించేందుకు ధాన్ ఫౌండేషన్ సహకారంతో 1200 మొక్కలను ఇప్పటికే నాటామన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

ఐక్యంగా ధారాలమ్మ పండగ నిర్వహించాలి

ప్రజాశక్తి-సీలేరు : గ్రామస్తులంతా ఐక్యంగా ధారాలమ్మ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించాలని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గం ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. దారకొండలో జరిగిన ఓ వివాహ వేడుకకు సోమవారం హాజరై ఆమె దారాలమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెలలో నిర్వహించే ధారాలమ్మ అమ్మవారి పండగ ఏర్పాట్లు గురించి దేవాదాయ శాఖ ఇఓ సాంబశివరావును అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. ముఖ్యంగా మంచినీరు, మహిళలకు టాయిలెట్స్, రవాణా సౌకర్యానికి అంతరాయం లేకుండా వాహనాలు పార్కింగ్ వంటివాటిపై దృష్టి సారించాలని కోరారు. పండగ రోజు అన్నదాన కార్యక్రమానికి తన వంతు సహాయంగా రూ.50 వేలు విరాళం అందజేస్తానని తెలిపారు. ఆర్‌వి నగర్ నుంచి పాలగెడ్డ వరకు రహదారి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. దారాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించి ముందస్తుగా ఆలోచన చేసి భక్తులకు అన్ని సౌకర్యాలు కలిగేలా నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గొర్ల వీరవెంకట్, కూటమి నాయకులు పోతురాజు గోవిందు, కృష్ణ శెట్టి వెంకటేష్, గొర్ల నరసయ్య, సుందరయ్య, ఏపీ జెన్కో ఉద్యోగి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధారాలమ్మను దర్శించుకున్న బాలరాజు

జికె వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్లోని ధారాలమ్మ అమ్మవారిని సోమవారం మాజీమంత్రి పసుపులేటి బాలరాజు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం దారకొండలో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో సమావేశమై యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

పాఠశాల భవన ప్రారంభంలో సంజయ్ కుమార్ మహాపాత్ర తదితరులు

ప్రభుత్వ పాఠశాల భవనం పున: ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందుస్తాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) ఇనిషియేటివ్‌లో భాగంగా హెచ్‌ఎస్ఎల్ కాలనీలో పునరుద్ధరించిన ప్రభుత్వ పాఠశాలను పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, సిఎస్ఎల్ కమిటీ సభ్యులు, యూనియన్ ప్రతినిధుల సమక్షంలో హెచ్‌ఎస్ఎల్ టెక్నికల్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ మహాపాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన, స్ఫూర్తిదాయక అభ్యసన వాతావరణాన్ని అందించడం, ఈ ప్రాంతంలో విద్యా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు.